క్రైం కథ

# అపరాధి

పులిపాక కనకదుర్గ

ఏసిపి పురోహిత్ సీరియస్‌గా ఫైలుని పరిశీలిస్తున్నాడు.

సింహం బారి నుంచి తప్పించుకున్న జింకలా పురోహిత్ చాంబర్లోకి దూసుకొని వచ్చాడు ఆకాష్.

ఆకాష్ శరీరం చెమటతో తడిసి ముద్దయ్యింది.

భయం వల్ల శరీరం కంపించడం స్పష్టంగా తెలిసిపోతోంది.

"సర్ వాడు మళ్లీ ఫోన్ చేశాడు." భయంతో మాట సరిగ్గా రాకపోవడం వల్ల తడబడుతూ చెప్పాడు ఆకాష్.


"ఎవరు? భైరవ్ మళ్లీ ఫోన్ చేసేడా?" బుల్లెట్‌లా వచ్చింది పురోహిత్ నోటి నుంచి ప్రశ్న.

"అవును సర్. తన గురించి చెప్తే ఏకంగా చంపేస్తానని వార్నింగ్ కూడా ఇచ్చాడు."

"దీర్ఘంగా నిశ్వసించి చెప్పేడు పురోహిత్. "ఆకాష్ మీరేమీ వర్రీ కాకండి. భైరవ్ అంతు చూసి జన్మలో మీ జోలికి రాకుండా చేసే పూచీ నాది. మీరు నిశ్చింతగా వుండండి."

"సర్... ఈసారి వాడిని ఉపేక్షిస్తే తట్టుకునే శక్తి నాకు లేదు. వాడు అడిగినంత ఇచ్చి వాడి పీడ వదల్చుకుంటాను."

"నో...నో... మిస్టర్ ఆకాష్. మరీ అంతలా నిరాశ పడకండి. అంతవరకూ రానివ్వకుండానే భైరవ్ పీడ విరగడయ్యేలా చేస్తాను."



పురోహిత్ ఇచ్చిన భరోసాతో వెనుదిరిగాడు ఆకాష్.

అతను వెళ్ళిన వైపే చూసితిరిగి ఆకాష్ కేసు తాలూకూ ఫైలును స్టడీ చెయ్యడం ప్రారంభించేడు అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్, పురోహిత్.

ఆకాష్ సిటీలో కెల్లా పెద్దదయిన సెంట్రల్ ఎయిర్ కండిషన్డ్ డైమండ్ జ్యూయలరీ షోరూం యజమాని. అదొక్కటే కాక రెండు పెట్రోలు బంకులు, సినిమా థియేటర్ కూడా అదే నగరంలో ఉన్నాయి. ఇంకా చాలా వ్యాపారాల్లో భాగస్వామ్యం వుంది. వయసు ముప్ఫై సంవత్సరాలు ఉండొచ్చు. అవివాహితుడు.

ఆకాష్ తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. ఆకాష్ తండ్రి ధనశ్యాం గుప్తాకు వరసకు తమ్ముడయ్యే దూరపు చుట్టం వున్నాడు అతను మహావీర్.

తండ్రి హయాం నడిచినంత వరకూ మహావీర్ ఆకాష్ తండ్రికి వ్యాపారంలో చేదోడు వాదోడుగా వుండేవాడు. వ్యాపారం ఆకాష్ చేతికి వచ్చిన దగ్గర్నుంచి భైరవ్‌తో విభేదాలు మొదలయ్యాయి.

భైరవ్ మహావీర్ ఒక్కగానొక్క కొడుకు. ఇంచుమించు ఆకాష్ వయసే వుంటుంది. ఆకాష్‌కు వరసకు తమ్ముడు.

ఊహ తెలిసినప్పటి నుంచి భైరవ్‌కు పెదతండ్రి సిరిసంపదలపై అవధులు లేని అసూయ కలిగింది. ఆ అసూయ ఆశగా మారింది.

ఆశ దురాశగా, దురాశ దుర్బుద్ధిగా మారడానికి ఎక్కువ కాలం పట్టలేదు.

ఆకాష్ చేతికి అధికారం వచ్చేక తన దుర్బుద్ధిని బయటపెట్టటడానికి ఎంత మాత్రం వెనకాడలేదు. భైరవ్ దుర్బుద్ధిని గ్రహించిన ఆకాష్ ముందుచూపుతో అతన్ని వ్యాపారాలన్నింటికి దూరంగా వుంచేడు.

భైరవ్‌కు మరింత ద్వేషం పెరిగింది ఆకాష్ మీద.

కానీ ఆకాష్ పలుకుబడి తెలిసినవాడు గనక కామ్ అయిపొయ్యేడు.

ఊరకుండిపోయిన భైరవ్ ఆకాష్ మీద మరింత అసూయద్వేషాలు పెరిగాయి. మహావీర్ భైరవ్‌కు ఎంతగానో నచ్చజెప్పాడు. "చూడు బేటా ఆకాష్ అనుభవిస్తోన్న ఆస్తంతా అతని తండ్రి, తాతల స్వార్జితం. ఆ ఆస్తుల మీద ఆకాష్‌కు సర్వహక్కులు న్యాయంగానే సంక్రమించాయి. మనకు వాటి మీద ఏ విధమైన అధికారమూ లేదు. నువ్వు అనవసరంగా మనవి కాని సొమ్ము మీద వ్యామోహాలు పెంచుకుంటున్నావు. అది ఎన్నటికీ మంచిది కాదు. ఆకాష్ మనకు యజమాని. అతని పట్ల విధేయత మనకు మంచిని చేస్తుంది. నా మాట విని మనసు మార్చుకొని మంచి మార్గాన పయనించు"

తండ్రి మాటలు భైరవ్ అసూయకు మరింత ఆజ్యం పోశాయి. అతని ధనకాంక్ష మరింత పెరిగింది. ఎలాగయినా ఆకాష్‌ని మట్టుపెడితే వారసులు లేని అతని ఆస్తంతా తమ పరమవుతుందన్న దురాశ కలిగింది. ఆకాష్‌కి దూరంగా వుంటూ అతన్ని ఏమీ చేయలేనని గ్రహించేడు. అందుకే తాను మంచిగామారినట్లుగా తండ్రిని నమ్మించేడు. పుత్ర ప్రేమ మహావీర్‌ని నమ్మించేలా చేసింది.

కొద్ది నెలల అతిమంచిగా మసలుకున్నాడు భైరవ్.

కొడుకు మారేడని పూర్తిగా నమ్మిన మహావీర్ ఆకాష్ దగ్గరకు వెళ్ళేడు. తన కొడుకు మంచిగా మారేడని, కనికరించి భైరవ్‌కు ఏదైనా ఉద్యోగం ఇప్పించమని వేడుకున్నాడు. భైరవ్ మారాడంటే ఆకాష్ నమ్మలేదు. కానీ ఎంతో విశ్వాసపాత్రుడయిన మహావీర్ మాటలను తేలిగ్గా తీసిపారెయ్యలేక భైరవ్‌కు తన దగ్గర ఉద్యోగం ఇచ్చేడు.

అదే ఆకాష్ చేసిన తప్పు.

భైరవ్ మంచిగా వున్నట్లు నటిస్తూనే ఆకాష్‌కి సంబంధించిన వివరాలన్నీ సేకరించాడు. కొద్ది నెలలు గడిచిపోయాయి.

ఇప్పుడు ఆకాష్ ప్రతి కదలిక భైరవ్‌కు తెలుసు. ఆ గుట్టుమట్టులు అన్నీ తెలుసుకుని భైరవ్‌కు చేరవేసేది మంజుల.

మంజు ఆకాష్ పి.ఏ. అనాథ శరణాలయంలో పెరిగిన ఆమె దయనీయ గాథ విని జాలితో ఉద్యోగమిచ్చేడు ఆకాష్.

రెక్‌లెస్‌గా, రఫ్‌గా వుండే భైరవ్‌ని చూడగానే మనసు పారేసుకుంది మంజు. క్రిమినల్ మెంటాలిటీ వున్న భైరవ్ ఆ విషయాన్ని ఇట్టే పసిగట్టాడు. ఆకాష్‌ని అడ్డుతొలగించుకోవాలంటే మంజు సహకారం ఎంతయినా అవసరమని గ్రహించి తనూ ఆమెకి దగ్గరయ్యేడు.

ఆకాష్ పి.ఏ. ఇప్పుడు భైరవ్ ప్రియురాలు.

జాగింగ్‌కని బయల్దేరిన ఆకాష్ మీద ఓ రోజు హత్యాయత్నం జరిగింది. వేగంగా వస్తున్న కారు ఆకాష్‌ని గుద్దిపారేసేది. ఆకాష్‌తో పాటు జాగింగ్ చేస్తున్న మిత్రుడు అప్రమత్తంగా వుండి ఆకాష్‌ని పక్కకు గుంజడంతో కాస్తలో ప్రమాదం తప్పింది.

జరిగిన సంఘటనలను యాదృచ్ఛికంగా భావించి ఆకాష్ ఆ విషయానికి అంత ప్రాధాన్యత ఇవ్వలేదు.

ఆ తరువాత మరి రెండు, మూడు సార్లు ప్రాణాపాయం నుంచి లక్కీగా బయటపడ్డాడు ఆకాష్.

అప్పుడు కలిగింది అనుమానం భైరవ్ మీద.

కూపీ లాగితే డొంకంతా బయటపడ్డది. జరిగిన హత్యాయత్నాలన్నీ భైరవ్ పుణ్యమేనని తేలింది. అందుకు మంజుల సహకారం కూడా తోడయ్యిందని బయటపడింది.

కూపీ లాగితే డొంకంతా బయటపడ్డది. జరిగిన హత్యాయత్నాలన్నీ భైరవ్ పుణ్యమేనని తేలింది. అందుకు మంజుల సహకారం కూడా తోడయ్యిందని బయటపడింది.

క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా మంజులని, భైరవ్‌ని ఉద్యోగాల్లోంచి తీసేసి పోలీస్ కంప్లయింట్ ఇచ్చేడు ఆకాష్.

విషయం తెలుసుకున్న మంజు, భైరవ్‌లు అజ్ఞాతంలోకి వెళ్ళిపోయేరు. వారి కోసం పోలీసులు ఎంత గాలించినా లాభం లేకపోయింది.

మరికొంతకాలం ప్రశాంతంగా గడిచిపోయింది.

వ్యాపార విస్తరణలో భాగంగా ఆకాష్ తమ బ్రాంచిని జైపూర్లో నెలకొల్పాడు. ఆ సందర్భంగా జైపూర్ వెళ్ళవలసి వచ్చింది.

అప్పటిదాకా అణిగి వున్న భైరవ్ ఒక్కసారిగా తన విశ్వరూపం చూపించేడు. ఈసారి తను ఒక్కడు గాక మరికొందరు క్రిమినల్స్‌ను కూడా కలుపుకొని ఆకాష్‌మీద దాడి చేసేడు. వెంట్రుకవాసిలో తప్పించుకున్నాడు ఆకాష్.

అప్పటి నుంచి దినదినగండమయ్యింది ఆకాష్‌కు జీవితం.

గంటకో బెదిరింపు ఫోన్ కాల్.

ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న టెన్షన్, భయం.

గత్యంతరం లేక తిరిగి పోలీసులను ఆశ్రయించేడు ఆకాష్.

ఎంత గాలించినా భైరవ్‌ని కనిపెట్టలేకపోయారు పోలీసులు.

అప్పుడే కేసుని ఏసిపి పురోహిత్‌కు అప్పగించేరు. ఎన్నో క్లిష్టమైన కేసులని ఇట్టే పరిష్కరించిన రికార్డు పురోహిత్ స్వంతం. నిజాయితీ కలిగిన సమర్థుడయిన పోలీస్ ఆఫీసరుగా సుపరిచితుడు.

పురోహిత్‌కు కేసు అప్పగించి నెల రోజులయ్యింది. ఈ నెలరోజుల్లో నాలుగు సార్లు బెదిరింపు కాల్స్ వచ్చాయి. ఒకసారి కార్లో వస్తున్న ఆకాష్ మీద హత్యాయత్నం జరిగింది. అయిదు కోట్లు ఇస్తే ఇటు తన జోలికి రానని భైరవ్ అన్నట్టుగా ఆకాష్ చెప్పేడు.

"అయిదుకోట్లు మరతనికి ఎందుకివ్వాలి? ఒకవేళ అలా ఇచ్చినా మిమ్మల్ని వదిలేస్తాడని మీరు నమ్ముతున్నారా?" అడిగేడు పురోహిత్.

సమాధానం చెప్పలేదు ఆకాష్.

"ఆకాష్ మీరు అతిగా భయపడుతున్నారు. అఫ్‌కోర్స్ మీ భయం సహజమే. కానీ ఒక్కటి గుర్తుంచుకోండి. ఎప్పుడయితే ఈ కేసు నేను టేకప్ చేశానో అప్పుడే భైరవ్ దొరికిపోయినట్లు లెక్క. మీరు అనవసరంగా భయాన్ని పెంచుకోక నిశ్చింతగా వుండండి" అభయం ఇచ్చేడు పురోహిత్.


ఆరోజు తను ఇచ్చిన భయంతో నిశ్చింతగా వెళ్ళిన ఆకాష్ ఈవేళ భయవిహ్వలుడయి తిరిగి వచ్చేడు.

చదవడం పూర్తి చేసిన పురోహిత్ ఫైలు క్లోజ్ చేసి ఆలోచనల్లో మునిగిపోయేడు. పోలీస్ శాఖక్కూడా దొరకనంత పకడ్బందీగా భైరవ్ తన కార్యకలాపాలను కొనసాగించగలుగుతున్నాడు. అంత విస్తృతమయిన నెట్‌వర్కు అతడికి ఎక్కడిది? ఆకాష్ తనకు ఫోన్ చేసిన ప్రతిసారీ క్షణాల్లో తాము అక్కడికి చేరుకున్నా ఎందుకు భైరవ్‌ను పట్టుకోలేకపోతున్నాము?

ఆలోచనల్లో మునిగిపోయిన పురోహిత్ నిర్విరామంగా మోగుతున్న సెల్‌ఫోన్‌ని వినిపించుకోలేదు.

"సర్ మీకు ఫోన్". పక్కనున్న కానిస్టేబుల్ పిలుపుతో చప్పున ఈలోకంలోకివచ్చేడు పురోహిత్.

ఫోన్ శ్వేత నుంచి.




ఒక్కసారిగా మూడ్ మారిపోయింది పురోహిత్‌కు ముద్దుల భార్య ఫోన్‌తో.

''ఓకే డియర్ పదినిమిషాల్లో నీ ముందుంటాను'' ఆదరాబాదరాగా ఇంటి బయలుదేరిన పురోహిత్‌ను చూసి ముసి ముసిగా నవ్వుకున్నాడు కానిస్టేబుల్.

ఆరోజు శ్వేత పుట్టినరోజు. పెందరాళే వచ్చేస్తానన్న పురోహిత్ ఎప్పటిలాగే మాట తప్పేడు. ఇంటికి చేరేసరికి శ్వేత అలకపాన్పు మీదుంది.

శ్వేత పేరుకు తగ్గట్టు శ్వేత వర్ణంలో వుంటుంది. మిలమిలాడే తేటకళ్లు. అద్దాల్లాంటి నునుపయిన చెక్కిళ్లు. చిన్న ఎర్రటి పెదాలు, సన్నగా పొడవుగా మెరుపు తీగలా వుంటుంది. అసలే అందమయిన శ్వేత పుట్టినరోజు అలంకరణతో మరింత అందంగా వుంది పురోహిత్‌ని చూడగానే చిరుకోపంతో ముఖం పక్కకు తిప్పుకుంది.

''సారీ శ్వేత'' శ్వేత పక్కన కూర్చుని చెప్పేడు పురోహిత్.

కోపం తగ్గకపోగా మరింత పెరిగింది. పురోహిత్ పక్క నుంచి జరిగి మంచానికి మరో పక్కన కూర్చుంది శ్వేత.

''సారీ చెప్పినా అంతకోపమయితే ఎలా?'' బ్రతిమాలుకున్నాడు శ్వేతని.

''సింపుల్‌గా సారీ చెప్పేస్తే సరిపోతుందా?''

''మరేం చెయ్యాలి చెప్పు? బర్త్‌డే బేబీకి స్నానం చేయించి ముస్తాబు చెయ్యనా? లేకపోతే...'' చిలిపిగా మరేదో అనబోయిన పురోహిత్ పెదాలను అరచేత్తో మూసేసింది శ్వేత.

నవ్వుకుంటూ అన్నాడు ''కోపం తగ్గినట్టేనా?'' పెదాలపైన శ్వేత అరచేతిని తన గుండెలమీద వేసుకుంటూ...

''ఇంక తగ్గినట్టు లేదు. నాచేత్తో స్వయంగా నీకు పాయసం చేసి తినిపిస్తాను. అప్పుడు అమ్మాయిగారి అలక ఇట్టే పోతుంది'' డ్రెస్ ఛేంజ్ చేసుకుని వంటింటి వైపు నడిచేడు పురోహిత్.

ఓరకంట అతన్నే గమనిస్తూ నవ్వుకుంది శ్వేత ప్రేమగా.

స్వీట్ టేస్ట్ చేసి పురోహిత్ కౌగిట్లో కరిగిపోయిన శ్వేత అలక మటుమాయమయ్యింది.

''కోపం పూర్తిగా పోయినట్టేగా'' శ్వేత చెక్కిలిని సుతారంగా మీటుతూ అడుగుతుండగా మళ్లీ ఫోన్ వచ్చింది ఆకాష్ నుంచి.

చివాలున లేచాడు పురోహిత్.

''మళ్లీ ఎక్కడికి?'' కోపంగా అడగాలనుకున్న శ్వేత జంకింది పురోహిత్ సీరియస్‌నెస్ చూసి.

***

ఆకాష్ ఇల్లంతా చిందరవందరగా వుంది.

సామానంతా పగలగొట్టబడి వుంది. ఎటు చూసినా బీభత్సంగా వుంది.

ఒక్క పక్క ఫోటోలు తీస్తుంటే మరో పక్క ఫింగర్ ప్రింట్స్ కోసమని చూస్తున్నారు ఫింగర్ ప్రింట్స్ ఎక్స్‌పర్ట్స్.

''సర్...రేపటిలోగా అయిదుకోట్లు ఇవ్వకపోతే నన్ను చంపేస్తానంటున్నాడు భైరవ్'' భయంగా చెప్పేడు ఆకాష్.

''ఈ నరకం భరించలేను. రేపే ఇచ్చేస్తాను'' కొద్దిసేపు తరువాత తిరిగి తనే చెప్పేడు ఆకాష్.

***

ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్స్ ఇచ్చిన రిపోర్ట్ చూస్తుంటే అప్రయత్నంగా భుకుటి ముడిపడింది పురోహిత్‌కు. 'ఇదెలా సాధ్యం?' తనలో తనే అనుకున్నాడు.

మరోమారు రిపోర్ట్‌ని పరిశీలించాడు.

చిన్నగా మొదలయిన అనుమానం క్రమంగా బలపడింది.

ఆకాష్ ఇంటి చుట్టూ మఫ్టీలో పోలీసులను ఏర్పాటు చేసేడు రహస్యంగా. ఆకాష్ ఇంట్లో ప్రతి ఒక్కరి కదలికల మీద నిఘా ఉంచబడింది. అదీ రహస్యంగా.

అప్పుడే దొరికింది. పోలీసుల కళ్లుగప్పి సంచరిస్తున్న మంజు ఆచూకి.

ప్రియురాలి మీద వ్యామోహం భైరవ్ కొంప ముంచి అతన్ని పట్టిచ్చింది.

***

''నిజంగా భైరవ్ ఆచూకి దొరికిందా?'' ఆదుర్దాగా అడిగేడు ఆకాష్.

''దొరకక ఎక్కడికి పోతాడు మిస్టర్ ఆకాష్ ఉరఫ్ భైరవ్'' చివరి పదాలను వత్తి పలుకుతూ చెప్పేడు పురోహిత్.

''మీరేం మాట్లాడుతున్నారు? నేను భైరవ్ కావడం ఏమిటి?'' భయవిహ్వలంగా అడిగాడు ఆకాష్(?)

''ఇంకా నటించవద్దు మిస్టర్ భైరవ్. ఆకాష్ నిన్నూ మంజుని డిస్మిస్ చేసేక చాలా తెలివిగా వ్యూహ రచన చేశావు. ఆకాష్‌కు దగ్గరగా వున్న నీ రూపురేఖలని ప్లాస్టిక్ సర్జరీతో పూర్తిగా ఆకాష్‌లా మార్పించుకున్నావు. సమయం కోసం ఎదురుచూస్తున్న నువ్వు ఆకాష్ జైపూర్‌లో బ్రాంచి ఓపెన్ చెయ్యడానికి వెళ్లడం తెలుసుకున్నావు. అదే అదనుగా నువ్వూ రహస్యంగా జైపూర్ వెళ్లేవు. ఒంటరిగా దొరికిన ఆకాష్‌ని బంధించి అతని స్థానంలో నువ్వు వచ్చావు. నీ మీద అనుమానం రావడానికి నీకు నువ్వే గాయపరుచుకొని ఫోన్ కాల్స్ చేసుకొని భైరవ్ చేశాడంటూ పోలీసులకు కంప్లయింట్ ఇచ్చేవు. అందుకే పోలీసులు ఎంత ఫాస్ట్‌గా రెస్పాండ్ అయినా భైరవ్‌ను పట్టుకోలేకపోయారు. నువ్వే భైరవ్ అయినప్పుడు పోలీసులకు ఎలా చిక్కుతావు? పాపం ఆకాష్‌లా మారినా ప్రియురాలి మీద వ్యామోహం చావక ఆమె దగ్గరకు వెళ్తూ నీ ఆచూకి నువ్వే తెలియజేశావ్. పద పోలీసు లాఠీలు నీకోసం ఎదురుచూస్తున్నాయి. ఆకాష్‌ని ఎక్కడ దాచింది నీ చేత నిజం చెప్పించడానికి'' భైరవ్‌ని తోస్తూ చెప్పేడు పురోహిత్.

''సర్ ఆకాష్, భైరవ్ ఒక్కరేనన్న అనుమానం మీకెందుకు వచ్చింది?'' బయట కలిసిన పురోహిత్‌ను ప్రశ్నించాడు ఓ ప్రెస్ రిపోర్టర్.

''ప్రపంచంలో ఏ మనిషి చేతి వేలి ముద్రలూ మరొకరి వేలి ముద్రలకు పోలి వుండవు. ఆకాష్(భైరవ్) నించి ఫోన్ వచ్చినప్పుడు ఆ ఇంట్లో అన్నింటి మీదా భైరవ్ వేలి ముద్రలు మాత్రమే వున్నాయి. చాలాకాలం క్రితమే ఆకాష్ వేలి ముద్రలు, మా పోలీసు డిపార్ట్‌మెంట్ అతను కంప్లయింట్ ఇవ్వడానికి వచ్చినప్పుడే సేకరించి పెట్టుకుంది. చిత్రంగా ఆకాష్ ఇంట్లో ఏ వస్తువు మీదా ఆకాష్ వేలిముద్రలు లేవు. అన్నీ భైరవ్ మోజుపడి కొనుక్కున్న కొత్త వస్తువులు కాబట్టి అన్నింటి మీదా భైరవ్ వేలి ముద్రలు మాత్రమే వున్నాయి. చిన్నచిన్న కేసుల్లో జైలుకు వచ్చిన భైరవ్ వేలిముద్రలు మా దగ్గర వున్నాయి. అవీ, ఇప్పుడు ఆకాష్ ఇంట్లో వున్న సామాన్ల మీద వేలిముద్రలు ఒకటే కావడంతో అనుమానం కలిగింది. అందుకనే ఆకాష్ ఇంటి మీద నిఘా పెట్టించాను. ఆకాష్ రూపంలో వున్న భైరవ్ ప్రియురాలు మంజరిని మాత్రమే అరెస్ట్ చేసి విచారిస్తే మొత్తం విషయాలు తెలిసాయి.''

''ఇంతకీ చేతికి దొరికిన ఆకాష్ భైరవ్ ఎందుకు చంపకుండా బంధించేడు?'' మరో రిపోర్టర్ అడిగాడు.

కోట్ల విలువ చేసే డైమండ్ జ్యూయలరీ ఆకాష్ ఇంట్లో సేఫ్‌లో భద్రంగా వుంది. ఆ సేఫ్‌ని ఓపెన్ చెయ్యాలంటే కావలసిన సీక్రెట్ కోడ్ ఆకాష్‌కు మాత్రమే తెలుసు. అది తెలుసుకొని చంపేద్దామని భైరవ్ ప్లాను. అయితే ఎంత హింసించినా అతనా కోడ్ చెప్పకపోవడం వల్ల ఆకాష్‌ని ఇంతదాకా భైరవ్ చంపలేదు. అవునా మిస్టర్ ఆకాష్ ఉరఫ్ భైరవ్'' నవ్వేడు పురోహిత్ ★